Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దినపత్రిక



ESHAGNA

ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును

RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

విలేకరులు కావలెను

గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్: 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ ఆదివారం 07-12-2025 సంపుటి : 1 సంచిక :171 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-



## ఇండిగో సంక్షోభం..!!

### విమాన టికెట్ ధరలపై కేంద్రం పరిమితి

- తాము టికెట్ల కోసం అధిక ధరలు చెల్లించినట్లు పలువురు ఎక్స్ వేదికగా పోస్టులు
- ప్రయాణికులను అధిక ఛార్జీల భారం నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టింది
- అంతరాయాల సమయంలో అసాధారణంగా ఛార్జీలను పెంచడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం
- ఈ తరహా అవకాశవాద ప్రవర్తన నుంచి ప్రయాణికులను రక్షించేందుకు చర్యలు చేపడుతున్నాం
- పెండింగ్ రీఫండ్స్‌ను వెంటనే చెల్లించాలి: కేంద్రం

..2వ పేజీలో

దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో అంతరాయం వల్ల ప్రయాణికులు గమ్యస్థానాలు చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిని కొన్ని విమానయాన సంస్థలు ఆసరాగా తీసుకోవడంతో టికెట్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. తాము టికెట్ల కోసం అధిక ధరలు చెల్లించినట్లు పలువురు ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఈ అవకాశవాద ధరల పెంపు విషయం తన దృష్టికి రావడంతో శనివారం కేంద్రం రంగంలోకి దిగింది. ప్రయాణికులను అధిక ఛార్జీల భారం నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టింది. ధరల నియంత్రణను తీసుకువచ్చామని, వాటిని పాటించాలని ఆదేశించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది "అంతరాయాల సమయంలో అసాధారణంగా ఛార్జీలను పెంచడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ తరహా అవకాశవాద ప్రవర్తన నుంచి ప్రయాణికులను రక్షించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభావిత మార్గాల్లో న్యాయబద్ధమైన ఛార్జీలను నిర్ధరించేందుకు మంత్రిత్వశాఖ తన నియంత్రణ అధికారాలను ఉపయోగించుకుంది. కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకునేవరకు కొత్తగా



## ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేస్తాం

### : రేవంత్‌రెడ్డి

దేవరకొండ: ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో రూ.23 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. "పోరాటాల పౌరుషం ఉన్న గడ్డ నల్గొండ. నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన జిల్లా నల్గొండ. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఆకలి తీర్చినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని మన ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తోంది. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. గుజరాత్

..2వ పేజీలో

## రూపాయి పతనం.. నిర్మలా సీతారామన్..

# కీలక వ్యాఖ్యలు...!!

### భారత రూపాయి మారకం విలువ అమెరికన్ డాలర్‌తో పోలిస్తే జీవనకాల కనిష్ఠాలకు పతనమవుతోంది

- రూపాయి విలువ 90.70-91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా
- రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలమేమీ కాదు...
- ఇలాంటి పరిస్థితులు ఎగుమతిదారులకు ప్రయోజనకరమే...బలంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ మూలాలు
- ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కంటే.. ఇప్పుడు ఆర్థికవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంది
- ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాలను క్రమబద్ధీకరించాం..
- ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపాయిపై చర్చ జరగాలి..
- మన ఉత్పత్తులపై సుంకాల వేళ.. ఇదికాస్త సానుకూలమే..
- రూపాయి కదలికలతో పాటు ఆర్థిక వ్యవస్థ బలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి
- కరెన్సీ హెచ్చుతగ్గులు ఆర్థిక వ్యవస్థ పనితీరును నిర్ణయించలేవు..
- కుటుంబాల్లో పొదుపు తగ్గుతోందన్న ఆందోళనలను మంత్రి తోసిపుచ్చారు
- సంప్రదాయ పొదుపు మార్గాల్లో మార్పులు వస్తుండటంతో అలా అనిపిస్తుంది



భారత రూపాయి మారకం విలువ అమెరికన్ డాలర్‌తో పోలిస్తే జీవనకాల కనిష్ఠాలకు పతనమవుతోంది. రూపాయి విలువ 90.70-91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలమేమీ కాదని, ఇలాంటి పరిస్థితులు ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనని వెల్లడించారు. ఈ మేరకు హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయని మంత్రి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కంటే.. ఇప్పుడు ఆర్థికవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉందని వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాలను క్రమబద్ధీకరించామన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపాయిపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. "రూపాయి విలువ తగ్గినప్పుడు.. మన ఎగుమతిదారులు దానిని సద్వినియోగం చేసుకుంటున్నారని నేను కచ్చితంగా చెప్పగలను. మన ఉత్పత్తులపై సుంకాల వేళ.. ఇదికాస్త సానుకూలమే. రూపాయి కదలికలతో పాటు ఆర్థిక వ్యవస్థ బలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కరెన్సీ హెచ్చుతగ్గులు ఆర్థిక వ్యవస్థ పనితీరును

## భారత్ బంధాలను వీటో చేసే అధికారం..

# ఏ దేశానికీ లేదు..!!

### ప్రపంచంలో ఏ దేశంతోనైనా సంబంధాలు ఏర్పరచుకునే హక్కు, స్వేచ్ఛ భారత్‌కు ఉన్నాయి

- ప్రపంచంలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా.. భారత్- రష్యా సంబంధాలు స్థిరంగా ఉన్నాయి
- రష్యాతో బంధం కారణంగానే అమెరికా- భారత్‌ల వాణిజ్య ఒప్పందం మరింత క్లిష్టంగా మారిందా?
- 'వీలైనంత ఎక్కువ దేశాలతో సహకారాన్ని కొనసాగించడం భారత్‌కు ఎంతో కీలకం
- ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి
- గత 70-80 ఏళ్లుగా ప్రపంచం చాలా ఎత్తుపల్లాలు చూసింది..
- అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి.. త్వరలోనే ఓ ఒప్పందం కూడా జరుగుతుంది
- తమ ప్రభుత్వానికి కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే ముఖ్యం : జై శంకర్



ప్రపంచంలో ఏ దేశంతోనైనా సంబంధాలు ఏర్పరచుకునే హక్కు, స్వేచ్ఛ భారత్‌కు ఉన్నాయని విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు. భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా.. భారత్- రష్యా సంబంధాలు స్థిరంగా ఉన్నాయన్నారు. శనివారం హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జైశంకర్ మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రష్యాతో బంధం కారణంగానే అమెరికా-భారత్‌ల వాణిజ్య ఒప్పందం మరింత క్లిష్టంగా మారిందా? అని విలేకరి ప్రశ్నించారు. దీనికి విదేశాంగ మంత్రి బదులిస్తూ.. 'వీలైనంత ఎక్కువ దేశాలతో సహకారాన్ని కొనసాగించడం భారత్‌కు ఎంతో కీలకం. ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఎవరితో సంబంధాలు కొనసాగించాలని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. గత 70-80 ఏళ్లుగా ప్రపంచం చాలా ఎత్తుపల్లాలు చూసింది. కానీ, భారత్-రష్యాల మధ్య బంధం స్థిరంగా కొనసాగుతోంది' అని అన్నారు. దౌత్యం అంటే మరొకరిని సంతోషపెట్టడం కాదు అని వ్యాఖ్యానించారు. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయన్నారు. త్వరలోనే ఓ ఒప్పందం కూడా జరుగుతుందన్నారు. భారత ప్రయోజనాలకు అనుగుణంగానే ఇది ఉంటుందని తెలిపారు. తమ ప్రభుత్వానికి కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే ముఖ్యమన్నారు.

**పాక్ ఆర్మీ నుంచే మనకు సమస్యలు...** ఇక, ఈ కార్యక్రమంలో పాకిస్థాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ గురించి ప్రశ్న ఎదురయ్యింది. దీనికి జైశంకర్ బదులిస్తూ.. పాక్ సైన్యంపై విమర్శలు గుప్పించారు. దాని నిజస్వరూపం మనకు తెలుసని.. దానివల్లే మన దేశానికి సమస్యలు వచ్చి పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో సరిహద్దుల్లో

..2వ పేజీలో

## దేవుడి సొత్తు విషయంలో...

# రాజీ సరికాదు..!!

### పరకామణి చోరీ కేసు విచారణను జగన్ స్వాగతించాలి

- ఈ వ్యవహారంలో సీసీ ఫుటేజ్ ఎలా తొలగించారో బయటకు రావాలి
- కల్తీ నెయ్యి, పరకామణి ఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరగాలి
- జగన్ ప్రభుత్వంలో చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలి
- ధర్మం కోసం మాత్రమే తితిదే నిధులు కేటాయించాలి
- ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విజయవాడ: పరకామణి చోరీ అంశంలో రాజీ చేయడాన్ని వ్యతిరేకించినట్లు ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. దేవుడి సొత్తు విషయంలో రాజీ చేయడం సరికాదని పేర్కొన్నారు. పరకామణి చోరీ కేసు విచారణను జగన్ స్వాగతించాలని కోరారు. ఈ వ్యవహా రంలో సీసీ ఫుటేజ్ ఎలా తొలగించారో బయటకు రావాలని పేర్కొన్నారు. కల్తీ నెయ్యి, పరకామణి ఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరగాలన్నారు. జగన్ ప్రభుత్వంలో చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ధర్మం కోసం మాత్రమే తితిదే నిధులు కేటాయించాలని కోరారు.





2వ పేజీలో

### ఇండిగో సంక్షోభంపై కేంద్రం చర్యలు..

## సీఈఓపై వేటు తప్పదా..?

# ఇండిగో సంక్షోభం..!!

(మొదటిపేజి తరువాయి) సూచించిన పరిమితులను కచ్చితంగా పాటించాలి. వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయిన నేపథ్యంలో సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, వైద్యసహాయం అందాల్సిన ప్రయాణికులు సీట్లు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ధరలపై నియంత్రణ ఉండేలా, దోపిడీని నిరోధించాల్సిన అవసరం ఉంది" అని మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అధికారులతో సమీక్ష జరిపిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఎయిర్‌లైన్స్, ట్రావెల్ ప్లాట్‌ఫామ్స్‌పై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిపెట్టడంతో ఎప్పటికప్పుడు ధరలపై పర్యవేక్షణ ఉంటుందని అధికారులు వెల్లడించారు. కరోనా సమయంలోనూ కేంద్రం ఇలా ధరల పరిమితిని విధించింది.

**పెండింగ్ రీఫండ్స్‌ను వెంటనే చెల్లించాలి: కేంద్రం**

ఎలాంటి జాప్యం లేకుండా పెండింగ్‌లో ఉన్న రీఫండ్‌లను వెంటనే చెల్లించాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది.



రద్దయిన, ఆలస్యమవుతోన్న విమాన సర్వీసులకు సంబంధించి రీఫండ్ ప్రక్రియను ఆదివారం రాత్రి 8 గంటల కల్లా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. రద్దు కారణంగా ఇప్పటికే ప్రభావితమైన ప్రయాణికులపై రీ షెడ్యూలింగ్ ఛార్జీలు విధించకూడదని తన ఆదేశాల్లో పేర్కొంది. ప్రయాణికుల లగేజీలను 48 గంటల్లో ఎవరివి వారికి అప్పగించాలని వెల్లడించింది. ఈ రీఫండ్ ప్రక్రియలో జాప్యం చేసినా లేక ఆదేశాలను బేఖాతరు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించింది. గత కొన్ని రోజులుగా వందల సంఖ్యలో ఇండిగో సర్వీసులు రద్దవుతున్న సంగతి తెలిసిందే. శనివారం కూడా పలు ఎయిర్‌పోర్టుల్లో వందలకు పైగా దేశీయ సర్వీసులు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో దిల్లీ ఎయిర్‌పోర్టు ప్రకటన విడుదల చేసింది. సర్వీసుల పునరుద్ధరణ జరుగుతోందని, అయితే కొన్ని సరీసులపై ప్రభావం కొనసాగుతోందని వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రైల్వే కూడా రంగంలోకి దిగింది. కొన్ని రైళ్లకు అదనపు బోగీలను జోడించడంతో పాటు, ప్రత్యేకంగా రైళ్లను కూడా నడుపుతోంది

## రూపాయి పతనం.. నిర్మలా సీతారామన్
# కీలక వ్యాఖ్యలు...!!

(మొదటిపేజి తరువాయి) నిర్ణయించలేవు" అని అన్నారు. కుటుంబాల్లో పొదుపు తగ్గుతోందన్న ఆందోళనలను మంత్రి తోసిపుచ్చారు. పొదుపు, పెట్టుబడులు పెరుగుతున్నాయని వెల్లడించారు. సంప్రదాయ పొదుపు మార్గాల్లో మార్పులు వస్తుండటంతో అలా అనిపిస్తుందని, కానీ వాస్తవంగా పొదుపు తగ్గడం లేదన్నారు. పైగా ఆస్తులు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో బ్యాంకు రుణాలు ఉపకరిస్తున్నాయని చెప్పారు. కాగా.. భారత్-అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో కొన్ని రోజులుగా రూపాయి మారకం విలువ పతనమవుతోంది. వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదారులు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటం రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

## భారత్ బంధాలను వీటో చేసే అధికారం
# ఏ దేశానికీ లేదు..!!

(మొదటిపేజి తరువాయి) శాంతి కోసం భారత్- చైనా సంబంధాలు కీలకమన్నారు. ఇటీవల ఇరుదేశాల సంబంధాలు బలపడిన విషయాన్ని ప్రస్తావించారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్వదేశంలో మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. హసీనా అప్పగింతపై ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో ఉండటం ఆమె వ్యక్తిగత విషయమన్నారు.


## ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టు
# పూర్తి చేస్తాం: రేవంత్‌రెడ్డి

(మొదటిపేజి తరువాయి) సహా దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్న బియ్యం ఇవ్వట్లేదు. యూపీఏ ప్రభుత్వ హయాములో రాష్ట్రంలో 25లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరిగింది. గత పదేళ్లలో ఎంతమంది పేదలకు ఇళ్లు ఇచ్చారో కేసీఆర్ చెప్పాలి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 4.50లక్షల ఇళ్లు పేదలకు మంజూరు చేశాం. లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించిందే ఇందిరమ్మ ప్రభుత్వం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 25లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసింది. ఒకే విడతలో రూ.2లక్షల చొప్పున రూ.21వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. రుణమాఫీ పేరిట పదేళ్లపాటు రైతులను కేసీఆర్ మోసం చేశారు. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కేసీఆర్ కలిసేవారు కాదు. ప్రగతి భవన్, ఫామ్‌హౌజ్‌లోకి ఎవ్వరినీ రానివ్వలేదు. కానీ, నిన్న ఇద్దరు సర్పంచ్‌లను కూర్చోబెట్టుకుని మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని చెబుతున్నారు. కేసీఆర్ ఓడిపోయాకే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఎస్‌ఎల్‌బీసీ పనులు ప్రారంభించగానే సొరంగంలో దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగింది. సొరంగంలో ప్రమాదం జరిగితే భారత రాష్ట్ర సమితి నేతలు సంబరపడ్డారు. ఏదేమైనా టన్నెల్‌ను పూర్తి చేసి నీరు అందిస్తాం" అని సీఎం అన్నారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు సభలో పాల్గొన్నారు.

## ఇక ఒంటిమిట్ట ఆలయం దశ తిరిగినట్టే..
# అభివృద్ధికి టీటీడీ మాస్టర్ ప్లాన్

**అన్నమయ్య జిల్లాలో పురాతన ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయ మాస్టర్ ప్లాన్ అభివృద్ధికి టీటీడీ కసరత్తు చేస్తోంది. వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా మాస్టర్ ప్లాన్ ను రూపొందించబోతోంది. ఇందులో భాగంగానే టిటిడి ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ తిరుపతిలో అధికారులతో సమీక్ష చేపట్టారు. టిటిడి పరిపాలనా భవనంలో తన ఛాంబర్ లో అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు.**

అన్నమయ్య జిల్లాలో పురాతన ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయ మాస్టర్ ప్లాన్ అభివృద్ధికి టీటీడీ కసరత్తు చేస్తోంది. వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా పూర్తి



స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా మాస్టర్ ప్లాన్ ను రూపొందించబోతోంది. ఇందులో భాగంగానే తాజాగా టీటీడీ ఈవో అధికారులతో సమావేశం నిర్వహించారు. రానున్న 50 ఏళ్ల నాటికి భక్తులు రోజుకు ఎంత మంది రావచ్చు, ఆలయ పరిసరాలు ఎలా ఉండాలి.. భక్తులకు సరిపడేలా మౌళిక సదుపాయాలు, వసతి, రవాణా, చారిత్రక నేపథ్యం ఉట్టిపడేలా, ఆధ్యాత్మికత, మరింతగా భక్తులు వచ్చేలా ముందస్తు ప్రణాళికలతో మాస్టర్ ప్లాన్ ను



రూపొందించాలని ఇంజనీరింగ్ శాఖ కు ఆదేశించారు. అదే విదంగా భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్ట, పుష్కరిణి, నక్షత్ర వనాలు, గార్డెనింగ్, పచ్చదనం, ఆధ్యాత్మిక చిహ్నాలు, శ్రీ కోదండరామ స్వామి ప్రాశస్త్యం నవతరానికి అందించేలా మ్యూజియమ్, ఉద్యానవనాలు, సాంకేతికతను జోడించి డిజిటల్ స్ర్కీన్స్, హనుమంతుడి సేవా నిరతి, సాంస్కృతిక కళామందిరం, లైటింగ్, తోరణాలు, చెరువులో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం, నాలుగు మాడ వీధుల అభివృద్ధి, సిసి కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై మాస్టర్ ప్లాన్ ను రూపొందించాలన్నారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో టిటిడి విజిలెన్స్, అటవీశాఖ, అన్నదానం, గార్డెనింగ్, ఎలక్ట్రికల్ తదితర శాఖల అధికారులను భాగస్వామ్యం చేసి ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ను తయారు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ డా. అనిల్ కుమార్ మాస్టర్ ప్లాన్ కు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా.. సమీక్షలో టిటిడి సీఈ టివి సత్యనారాయణ, ఎస్.ఈ-1 మనోహరం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇండిగో సంక్షోభంపై కేంద్రం చర్యలు.. సీఈఓపై వేటు తప్పదా..?

దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో అంతరాయంతో దేశవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. కొన్ని రోజులుగా కొనసాగుతోన్న సంక్షోభం ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ పరిస్థితులను కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ (%×అఎఱ+శీ జజూా%)ను పదవి నుంచి తొలగించేలా ఇండిగో బోర్డుకు ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉన్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అలాగే ఎయిర్‌లైన్‌పై భారీగా జరిమానా విధించేందుకు సిద్ధమవుతోందని సీనియర్ అధికారుల వ్యాఖ్యల బట్టి తెలుస్తోందని సమాచారం. పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఈ రోజు సాయంత్రం ఇండిగో అధికారులను పిలిపించి మాట్లాడనుంది. అలాగే ఆ కంపెనీ విమాన సర్వీసుల్ని తగ్గించనున్నట్లు తెలుస్తోంది. అనుకోకుండా ఎదురైన అనేక సవాళ్లు ఈ పరిస్థితికి కారణమని ఇప్పటికే ఇండిగో తెలిపింది. సాంకేతిక సమస్యలు, చలికాలం వల్ల షెడ్యూల్‌లో మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, విమానయాన వ్యవస్థలో ఇబ్బందులు,



సిబ్బందికి సంబంధించిన కొత్త రోస్టర్ నియమాలు కారణమని వివరణ ఇచ్చింది. ఈ కొత్త నియమాల ప్రకారం పైలట్ల సంఖ్యను సరిగా అంచనావేయకపోవడం వల్లే దేశీయ సర్వీసుల్ని నిర్వహించడంలో ఇబ్బందిపడుతోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీటీఎల్‌లోని వీక్లీ విశ్రాంతి నిబంధనను తాత్కాలికంగా పక్కన పెడుతున్నట్లు ప్రభుత్వం నిన్న వెల్లడించింది. ఈ చర్యలతో మూడురోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని భావిస్తోంది. ఈ అంతరాయాలపై కేంద్రం ఇప్పటికే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మొత్తం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని పౌర విమానయాన శాఖ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ సంజయ్ కె బ్రహ్మనే, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ గుప్తా, సీనియర్ ట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాన్‌గ్లిక్, ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ రాంపాల్ ఉన్నారు. వీరు భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకో కుండా కొన్ని సిఫార్సులు కూడా చేయనున్నారు

# ఇవి తింటే మీ చిట్టి గుండె సేఫ్..

**లైట్ తీసుకుంటే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లే..**

**నేటి ఆధునిక జీవనశైలిలో గుండె ఆరోగ్యం కాపాడుకోవడం అత్యంత కీలకం. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు గుండె ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అయితే గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఆహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. సరైన పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా గుండెను పదిలంగా ఉంచుకోవచ్చు. గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి మీ రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవాల్సిన 8 అద్భుతమైన ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..**

**వాల్‌నట్స్:** వాల్‌నట్స్ కూడా ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి ధమనుల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి.



**అవకాడో:** అవకాడోలు ఆరోగ్యకరమైన మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులతో సమృద్ధిగా ఉంటాయి. వీటిలో ఉండే పొటాషియం, ఫోలేట్ రక్తపోటును సమర్థవంతంగా నియంత్రించడంలో సహాయపడతాయి. తద్వారా గుండెపై ఒత్తిడి తగ్గుతుంది.

**సాల్మన్ చేప:** ఈ చేపలో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఒమేగా-3 లు గుండె చుట్టూ ఉన్న మంటను కూడా తగ్గించడంలో తోడ్పడతాయి.



**బెర్రీలు:** స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు వంటి బెర్రీలలో ఫ్లేవనాయిడ్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించడంలో, రక్త నాళాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది.



**ఆకుకూరలు:** పాలకూర వంటి ఆకుకూరలు పొటాషియం, మెగ్నీషియం యొక్క అపారమైన మూలం. ఈ ఖనిజాలు రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా ఆకుకూరలలో నైట్రేట్‌లు కూడా ఉంటాయి. ఇవి రక్త నాళాలను సడలించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి.



**బీట్‌రూట్:** బీట్‌రూట్‌లో సహజమైన నైట్రేట్‌లు, పొటాషియం అధికంగా ఉంటాయి. శరీరంలో ఈ నైట్రేట్‌లు నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. ఇది రక్త నాళాలను విస్తరించి, రక్తపోటును తగ్గిస్తుంది. ఇది గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.



**అరటిపండు:** గుండె ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైన ఖనిజాలలో ఒకటైన పొటాషియం అరటిపండులో సమృద్ధిగా ఉంటుంది. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422%ఎగ్ర% పొటాషియం ఉంటుంది. ఇది అధిక రక్తపోటును నియంత్రించడానికి, సోడియం ప్రభావాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. టమాటా: టమాటాలలో లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, పొటాషియం అధికంగా ఉంటాయి. ఈ పోషకాలు రక్తపోటును నియంత్రించడానికి, గుండె కణాలను దెబ్బతినకుండా కాపాడటానికి ప్రయోజనకరంగా ఉంటాయి. కేవలం ఈ ఆహారాలను తీసుకోవడమే కాకుండా ఉప్పు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించడం ద్వారా మీ గుండె ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చు.

# కొత్తిమీర తింటే బరువు తగ్గుతారా..

**ఈ విషయాలు తెలిస్తే అస్సలు వదలరు..**

**కొత్తిమీర కేవలం వంటకాలకు రుచినివ్వడమే కాదు ఆరోగ్య ప్రయోజనాల గని. ఇది గుండె, మెదడు, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. ముఖ్యంగా కొత్తిమీర జీర్ణక్రియను పెంచి, జీవక్రియను వేగవంతం చేసి, ఆకలిని తగ్గిస్తుంది. కొవ్వును కరిగించి, బరువు తగ్గడంలో అద్భుతంగా సహాయపడుతుంది.**

వంటకాలకు అద్భుతమైన రుచిని, సువాసనను ఇచ్చే కొత్తిమీర.. కేవలం గార్నిష్ వస్తువు మాత్రమే కాదు. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ఒక శక్తివంతమైన హెర్బ్. ముఖ్యంగా కొత్తిమీర ఆకులు, వాటి విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కొత్తిమీరను ఆహారంలో భాగంగా చేసుకోవడం లేదా కొత్తిమీర నీరు తాగడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బరువు తగ్గడంలో దాని పాత్ర గురించి తెలుసుకుందాం.




**రక్తంలో చక్కెర నియంత్రణ:** కొత్తిమీరలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వలన ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి ఇది చాలా మంచిది.

**గుండె, మెదడు, చర్మ ఆరోగ్యం:** దీనిలోని పోషకాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మెదడు పనితీరుకు తోడ్పడతాయి. యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయి.

**ఇన్ఫెక్షన్ల నివారణ:** కొత్తిమీర నీరు తాగడం వలన సాల్మొనెల్లా వంటి హానికరమైన సూక్ష్మక్రిములతో పోరాడటానికి శరీరం సిద్ధమవుతుంది. ఇది ఆహారం ద్వారా వచ్చే అనారోగ్యాలు, ఇతర ఇన్ఫెక్షన్లను నివారించడంలో మంచిది.

**బరువు తగ్గడంలో కొత్తిమీర పాత్ర...** బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి కొత్తిమీర ఒక గొప్ప సహజ ఔషధంలా పనిచేస్తుంది.

**జీర్ణక్రియ మెరుగు:** బరువు తగ్గడానికి మంచి జీర్ణక్రియ చాలా అవసరం. కొత్తిమీర నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, తీసుకున్న ఆహారం సరిగ్గా జీర్ణమయ్యేలా చేస్తుంది.

**మెరుగైన జీవక్రియ:** కొత్తిమీర నీరు తాగడం వలన శరీర జీవక్రియ రేటు మెరుగుపడుతుంది. దీని ఫలితంగా కేలరీలను వేగంగా కరిగించుకోవడానికి సహాయపడుతుంది. ఇది సులభంగా బరువు తగ్గడానికి దారితీస్తుంది.

**ఆకలిని తగ్గిస్తుంది:** కొత్తిమీర నీరు తాగడం వలన ఆకలి తగ్గుతుంది. దీనిని తాగడం ద్వారా మీరు అధిక కేలరీల ఆహారాలు మరియు స్నాక్స్ తీసుకోవడం తగ్గిపోతుంది. తద్వారా బరువును సమర్థవంతంగా నియంత్రించుకోవచ్చు.

**కొవ్వు తొలగింపు:** కొత్తిమీర శరీరంలో పేరుకుపోయిన అనవసరమైన కొవ్వును తొలగించడానికి సహాయపడుతుంది.

**కొత్తిమీర గింజల ప్రత్యేకత..** కొత్తిమీర ఆకులే కాకుండా కొత్తిమీర గింజలు కూడా ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటిలో చాలా ఫైబర్ ఉంటుంది. వీటిని తినడం వల్ల కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉంటుంది. ఆకలి తగ్గుతుంది. ఇది కూడా పరోక్షంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. కొత్తిమీర ఆకులు, విత్తనాలను రోజూ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. ముఖ్యంగా కొత్తిమీర నీటిని క్రమం తప్పకుండా తాగడం ద్వారా మీ బరువు తగ్గించే లక్ష్యాన్ని త్వరగా చేరుకోవచ్చు.

# బెత్తంతో గాయాలు విద్యార్థులపై అమానుష హింస యాజమాన్యం మౌనమేంటి?

**- అమానవీయంగా విద్యార్థులను చేయించుకుంటున్న అధ్యాపకుడు**

**- చోద్యం చూస్తున్న కళాశాల యాజమాన్యం**

**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు రిపోర్టర్ రంజిత్**



పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల లో అధ్యాపకుడు విద్యార్థులపై కర్కసయంగా ప్రవర్తిస్తున్నాడు. ఏకంగా విద్యార్థుల పై అమానవయంగా వ్యవహరిస్తూ.. ఇష్టారాజ్యంగా చేయిచేసుకుని కనీసం జంతువుల కంటే హీనంగా కొడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఒళ్లంతా గాయాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరుగుతున్న పాఠశాల యాజమాన్యం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వారి వ్యవహార శైలితో విద్యార్థులు తల్లిదండ్రుల నుండి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివరాల్లోకెళ్తే శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక రిపబ్లిక్ క్లబ్ ఎదుట రాయలసీమ అనే కళాశాల ఉంది. ఇక్కడ చదువుతున్న ఇంటర్ విద్యార్థులను ఓ తెలుగు అధ్యాపకుడు చదువు విషయంలో తీవ్రమైన ఒత్తిడి పెడుతున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు పత్రికల వారి ముందు వాపోయారు. అతను పెట్టే హింసను ప్రతిరోజు అనుభవించలేక పోతున్నామని మాకు ఈ కళాశాల వద్దని విద్యార్థులు తమ తండ్రులతో వాగ్వి వివాదాలు చేస్తున్నట్టు సమాచారం. పట్టణంలో స్థానిక కోర్టు వీధిలో నివాసముంటున్న అనీస్ అనే విద్యార్థిని శనివారం ఆ కళాశాలలోని ఓ తెలుగు అధ్యాపకుడు తెలుగు సబ్జెక్టుకు సంబంధించి పేరాగ్రాఫర్ రాలేదని ఒళ్లంతా గాయాలు అయ్యేటట్టు బెత్తంతో కొట్టి హింసించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు కళాశాలలో విద్యార్థుల మీద అధ్యాపకులకి చేయి చేసుకునే అధికారం ఎక్కడుంది. దీనిపై వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇదంతా కళాశాల కరస్పాండెంట్ కి తెలియకుండా జరుగుతుందా అని వాపోతున్నారు. దీనిపై జిల్లా శాఖ అధికారులు స్పందించి ఈ కళాశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది. లేదంటే ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావత్తం అయ్యి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

# డాక్టర్ అంబేద్కర్ జ్ఞాపకార్థం ప్రజా సంఘాల స్ఫూర్తిదాయక నివాళులు

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 6, గాయత్రి వార్తలు:రిపోర్టర్ : రంజిత్**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శ్రీకాళహస్తి అంబేద్కర్ కూడలి వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి, దీపప్రజ్వలన చేసి, ఆయన ఆలోచనలు సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ గురించి నాయకులు స్మరించుకున్నారు. జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్, అడ్వకేట్ పుష్పలత, సిపిఐ నాయకులు జనమాల గురవయ్య, చారులత, దళిత సీనియర్ నాయకులు గుమ్మడి బాలకృష్ణయ్య, రిటైర్డ్ ఉద్యోగులు నాగరాజు, సిద్దయ్య, కాంగ్రెస్ నాయకులు సుబ్బరామయ్య, భాస్కర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ సేవలను స్మరించారు. దళిత యువ నాయకులు కయ్యూరు శివ, పేయూరు కస్తూరయ్య, దారా వినోద్, పులి కస్తూరయ్య తదితరులు కూడా పాల్గొని అంబేద్కర్ చూపిన మార్గంలో సాగాలని ప్రతిజ్ఞచేశారు.

# హల్లో కార్మిక చలో వైజాగ్

**- జనవరి 4 చలో వైజాగ్ బహిరంగ సభ జయప్రదం చేయండి.**

**- సిఐటియు జిల్లా కార్యదర్శి సాయికిరణ్ పిలుపు**

కుక్కునూరు డిసెంబర్ 6 : జనవరి 4న సిఐటియు జాతీయ మహాసభలు సందర్భంగా విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభ,ప్రదర్శనను కార్మికులంతా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. శనివారం నాడు స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాలు కార్యాలయంలో కుంజా నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల కమిటి సమావేశంలో మహాసభలు జయప్రదం కోరుతూ గోడ పత్రికలు విడుదల చేసారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ... సిఐటియు ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా విశాఖపట్నం నగరంలో 18వ సిఐటియు అఖిల భారత మహాసభలు జరుగుతున్నాయి అని అన్నారు. మూడేళ్ళుగా కార్మికులకు వ్యతిరేక విధానాలపై,సమస్యలు పై చర్చించి నూతన ప్రణాళికలు సిద్ధం చేయడం కోసం మహాసభలు జరుగుతున్నాయి అని అన్నారు. దేశం నలుమూలల నుండి ఈ మహాసభకు ప్రతినిధులకు హాజరుకానున్నారు అని, మహాసభ చివరి రోజు జనవరి 4వ తేదిన భారీ ప్రదర్శన, ఆర్.కె.బీచ్ లో లక్ష మంది కార్మికులతో బహిరంగ సభ నిర్వహించి మహాసభలో తీసుకున్న నిర్ణయాలు కార్మికులు అందరికి తెలియజేయడం జరుగుతుంది అని అన్నారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలకు కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సాయికిరణ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు బాడీసా సుజాత,కాక బాపనమ్మ,పాముల అన్నపూర్ణ, కమల,నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఏడు గంగమ్మల జాతరకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి కమిటీ ఆహ్వానం



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 6(గాయత్రి వార్తలు) రిపోర్టర్ : రంజిత్**

శ్రీకాళహస్తి పట్టణంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఏడు గంగమ్మల జాతర ఏర్పాట్లు జోరుగా సాగుతున్న నేపథ్యంలో, జాతర కమిటీ ప్రతినిధులు స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. పెండ్లి మండపం గంగమ్మ కమిటీ అధ్యక్షులు కాసరం రమేష్ మరియు సభ్యులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కార్యాలయంలో కలిసిన సందర్భంగా జాతర ప్రత్యేకతలు, కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ప్రతి సంవత్సరం భారీగా జరిగే ఈ జాతరలో ప్రజలు అశేషంగా పాల్గొంటారని, ఈ ఏడాది మరింత భవ్యంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరా రాజేష్, జజాల మురళి, బాబు నాయుడు, బద్రి, శరవణ, తుమ్మ బాల తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద కన్నలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్ఆర్సిపి నాయకుల ఘన నివాళులు

**తొట్టంబేడు, డిసెంబర్ 6(గాయత్రి వార్తలు) రిపోర్టర్ : రంజిత్**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించిన అనంతరం మాట్లాడిన డా. సుబ్రహ్మణ్యం డాక్టర్ అంబేద్కర్ ప్రముఖ న్యాయవేత్త, దళిత ఉద్యమ దిక్సూచి, సామాజిక సంస్కర్తగా భారత సమాజానికి ఎనలేని సేవలు చేశారని గుర్తుచేశారు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం అలుపెరగకుండా పోరాడిన అంబేద్కర్ అమూల్యమైన సిద్ధాంతాలు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయని అన్నారు. "రాజ్యాంగం రూపకల్పన ద్వారా అంబేద్కర్ అందించిన హక్కులు, సమానత్వ భావనను మనం ఎప్పటికీ మరువలేం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పెరుమాళ్ రెడ్డి, దళిత నాయకులు ఎం. గిరి, సర్పంచ్ నాగేంద్ర, కె. సుబ్రహ్మణ్యం, చిట్టిబాబు, కే. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. పెద్ద కన్నలి గ్రామ ప్రజలు కూడా విస్తృతంగా హాజరై అంబేద్కర్ సేవలను స్మరించారు.



# తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం 3.0 గిరిజన సలహా మండలి సభ్యుడు సుబ్బయ్య ప్రధాన అతిథి



**శ్రీకాళహస్తి(గాయత్రి వార్తలు) రిపోర్టర్ : రంజిత్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం 3.0 రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణలో భాగంగా, శ్రీకాళహస్తి రాజీవ్ నగర్ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో కూడా ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు ఎం. సుబ్బయ్య హాజరయ్యారు. ప్రవేశిస్తున్న అతిథిని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికి సత్కరించారు. తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం 3.0 ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రత్యేకంగా ముందుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తిలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల పురోగతి, తల్లిదండ్రుల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. పాఠశాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు విశేషంగా పాల్గొన్నారు.

# గురవయ్య నాయుడు స్ఫూర్తిగా రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న సేవా కార్యక్రమం





**తొట్టంబేడు,(గాయత్రి వార్తలు) రిపోర్టర్ : రంజిత్**

తొట్టంబేడు మండలం ఇలగనూరు పంచాయతీ పరిధిలోని గురవయ్య నాయుడు ఎస్టీ కాలనీలో, దివంగత పోతుగుంట గురవయ్య నాయుడు జ్ఞాపకార్థంగా గత 20 ఏళ్లుగా కొనసాగుతున్న సాంప్రదాయ సేవా కార్యక్రమంలో భాగంగా ఈరోజు 40 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది.

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు మాట్లాడుతూ దివంగత గురవయ్య నాయుడు సామాజిక సేవాపరుడు, ప్రజల సమస్యల పరిష్కారానికే తన రాజకీయ జీవితం అంకితమిచ్చారని గుర్తుచేశారు. అప్పటి మంత్రి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తో కలిసి ప్రయత్నించి, కొణతనేరి పంచాయతీకి చెందిన ఎగువ, దిగువ చెరువుల్లో గిరిజనులు చేపలు పట్టుకునే హక్కులకు సంబంధించి ఆ సమయంలో కలెక్టర్ ద్వారా జీఓ జారీ చేయించారని, ఆ హక్కులు ఈ రోజు వరకు అమల్లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గాలి మురళి నాయుడు, వట్టికుండల మునిరత్నం నాయుడు, లెక్కల రవి నాయుడు, ముని కుమార్, కురుగొండ బుజ్జి నాయుడు, పెయ్యులు కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.




# 'పరదా' మూవీ రివ్యూ




నటీనటులు:

అనుపమ పరమేశ్వరన్- దర్శన రాజేంద్రన్- సంగీత- రాగ్ మయూర్- రాజేంద్ర ప్రసాద్- గౌతమ్ మీనన్ తదితరులు

సంగీతం: గోపీసుందర్

ఛాయాగ్రహణం: మృదుల్ సుజిత్

కథ: పూజిత శ్రీకంటి

స్క్రీన్ ప్లే: పూజిత శ్రీకంటి- ప్రవీణ్ కాండ్రేగుల- ప్రహాస్ బొప్పుడి

నిర్మాతలు: శ్రీనివాసులు- విజయ్ డంకాడ- శ్రీధర్ మక్కువ

దర్శకత్వం: ప్రవీణ్ కాండ్రేగుల

సినిమా బండి.. శుభం.. లాంటి వైవిధ్యమైన చిన్న చిత్రాలతో ఆకట్టుకున్న యువ దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల నుంచి వచ్చిన కొత్త చిత్రం.. పరదా. అనుపమ పరమేశ్వరన్.. దర్శన రాజేంద్రన్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమా ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

## కథ:

పడతి అనే గ్రామంలో ఓ వింత ఆచారం ఉంటుంది. ఆ ఊరిలో మహిళలు ఎవ్వరూ బయటి మగవారికి ముఖం చూపించకూడదు. ముఖాన్ని పరదాతో కప్పుకోవాలి. ఈ షరతును మీరితే ఊరి దేవత శాపం ఆ గ్రామం మీద పడి అనర్థాలు జరుగుతాయని భావిస్తారు. ఆ గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ఊరి కట్టుబాట్లను గౌరవిస్తూ ఎక్కడా ముఖానికి పరదా తొలగిపోకుండా జాగ్రత్త పడుతుంటుంది. ఆమె ప్రేమించిన అబ్బాయికి తన ముఖం చూపించదు. తన ముఖమూ సుబ్బలక్ష్మి చూడదు. ఆమె ఇష్టపడ్డ అబ్బాయితోనే నిశ్చితార్థానికి సిద్ధమవుతున్న సమయంలో తన ముఖచిత్రం ఒక మ్యాగజైన్లో పడడం.. అది ఊరి వాళ్లకు తెలియడంతో కలకలం రేగుతుంది. ఊరి కట్టుబాటు ప్రకారం సుబ్బలక్ష్మి ఆత్మాహుతికి పాల్పడాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. మరి ఆ శిక్షను సుబ్బలక్ష్మి తప్పించుకోగలిగిందా.. అందుకోసం ఆమె ఎంత వరకు పోరాడింది.. చివరికి ఏం జరిగింది అన్నది మిగతా కథ.

## కథనం-విశ్లేషణ:

అనగనగా ఒక ఊరు.. ఆ ఊర్లో ఆడవాళ్లందరూ ముఖం కనిపించకుండా పరదా వేసుకుని తిరుగుతుంటారు. పొరపాటున బయటి మగాళ్లకు ముఖం చూపిస్తే.. అనర్థం జరిగిపోతుందట. ఆ అమ్మాయిని చంపేస్తారట. ఇదేం వింత ఆచారం.. ఈ రోజుల్లో ఇలాంటి ఊరు ఎక్కడుంటుంది? అనిపిస్తుంది కదా? 'పరదా'లో ఇలా చూపించారు అంటే.. అది బహుశా కొన్ని శతాబ్దాల కిందటి కథ అయ్యుంటుందేమో.. అందులోని పాత్రలన్నీ అడవి మనుషులేమో అనుకుంటాం. కానీ ఈ కథను వర్తమానంలో జరుగుతున్నట్లే చూపించారు. మరి ఈ రోజుల్లో ఉన్న పరిస్థితులకు ఆ కాన్సెప్ట్ ఎలా సింక్ అవుతుంది? తెర మీద జరిగేది నమ్మశక్యంగా అనిపించనపుడు అందులో ఉన్న ఎమోషన్ తో కనెక్ట్ కావడం కష్టమవుతుంది. పురుషులతో సమానంగా, వాళ్లను మించి మహిళలు సాధించి చూపిస్తున్న రోజుల్లో ఉంటూ.. మహిళలను ఈ ప్రపంచం తొక్కేస్తున్నట్లు పనిగట్టుకుని ప్రతి సన్నివేశాన్నీ తీర్చిదిద్దడం 'పరదా'లో ఉన్న మరో సమస్య. ఇందులో చెప్పాలనుకున్న విషయం మంచిదే అయినా.. కాన్సెప్ట్ రొటీన్ కు కొంచెం భిన్నంగా అనిపించినా.. రియాలిటీకి కొంచెం దూరంగా సన్నివేశాలను నడిపించడం.. ఒక దశ దాటాక ప్రీచీగా తయారవడంతో 'పరదా' ప్రేక్షకులను అనుకున్నంతగా ఎంగేజ్ చేయలేకపోయింది.మంచి సందేశం ఇవ్వాలనుకున్న సినిమాలన్నీ గొప్ప సినిమాలు అయిపోవు. ఆ సందేశాన్ని ఎంత బాగా ప్రెజెంట్ చేశారు.. ప్రేక్షకులు కథతో ఎంతగా రిలేట్ అయ్యారన్న దాన్ని బట్టే ఆ సినిమా స్థాయి ఏంటన్నది నిర్ణయమవుతుంది. ఇప్పటికీ సమాజంలో పురుషాధిక్యత ఉందన్నది.. మహిళలు ఎదగడంలో కొన్ని అడ్డంకులు ఉన్నాయన్నది వాస్తవం. అదే సమయంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్లడానికి అవసరమైన అవకాశాలూ ఉన్నాయి. ఇలాంటి సానుకూల వాతావరణం ఉండగా.. వర్తమానంలో కథను నడుపుతూ మహిళలను బాధితులుగా చూపిస్తూ.. పురుషులను విలన్లుగా ప్రొజెక్ట్ చేస్తూ 'పరదా' చిత్రాన్ని నడిపించారు. సినిమా అంతా ఇలాగే వన్ సైడెడ్ గానే సాగుతుంది. ఈ విషయంలో సర్దుకోగలిగినా.. గ్రామంలో జరిగే వ్యవహారాలు మాత్రం అతిశయోక్తిలా అనిపిస్తాయి. పరదా తీస్తే ఆత్మాహుతి అంటూ మరీ విడ్డూరంగా అనిపించే పాయింటు మీద కథను నడిపించడంతో దాని తాలూకు ఎమోషన్ ప్రేక్షకులకు పట్టడం కష్టమవుతుంది. కాన్సెప్ట్ కొత్తగా ఉండడం వల్ల ప్రథమార్థంలో కొన్ని సన్నివేశాల వరకు ప్రేక్షకుల అటెన్షన్ రాబడుతుంది 'పరదా'. కథానాయికకు ఒక ఫేమస్ ఫొటోగ్రాఫర్ వల్ల ఇబ్బంది తలెత్తుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి ఒక వ్యక్తిని వెతుక్కుంటూ వెళ్లి కలవడం పెద్ద విషయమే కాదు. ఐతే దాని మీదే గంటకు పైగా స్టోరీ నడిపించాలనుకోవడం దర్శకుడు చేసిన పెద్ద రిస్క్. ఈ రిస్కుని ఛేదించడానికి అవసరమైన పకడ్బందీ కథనం ఇందులో మిస్సయింది. కొన్ని సన్నివేశాలు హృద్యంగా అనిపించినా.. తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తి రేకెత్తించేలా కథనం సాగకపోవడం ప్రతికూలమైంది.ఒక జర్నీలో మనిషి పరివర్తన చెందడం అనే చాలాసార్లు చూసిన పాయింట్ మీద నెమ్మదిగా కథనాన్ని నడిపించాడు దర్శకుడు. అక్కడక్కడా కొన్ని సీన్లు ఇంట్రెస్టింగ్ గా అనిపించినా.. నరేషన్లో వేగం లేకపోవడం.. కథ పెద్దగా ముందుకు కదలకపోవడం సమస్యగా మారింది. ఫస్టాఫ్ లో కథ పరంగా కొన్ని మలుపులుండడం.. సన్నివేశాల్లో కొంచెం వేగం ఉండడం వల్ల కొంత ఎంగేజ్ చేసినా.. రెండో అర్ధం మాత్రం నిరాశపరుస్తుంది. 'పరదా' క్లైమాక్స్ ఏంటన్నది చాలా ముందుగానే ఒక అంచనా వచ్చేసేలా ద్వితీయార్ధంలో కథనం నడుస్తుంది. ముగింపు సన్నివేశాలు అంచనాలకు తగ్గట్లే సాగినప్పటికీ హృద్యంగా అనిపిస్తాయి. కానీ ఓవరాల్ గా సినిమా మీద అభిప్రాయం మారిపోదు. కాన్సెప్ట్ కొత్తగా ఉంటే సరిపోదు.. అది ప్రేక్షకులు రిలేట్ చేసుకునేలా ఉండాలి. బిలీవబిలిటీ అనేది కూడా చ్లాలా కీలకం. అది లేకపోవడం వల్ల 'పరదా'కు . సందేశాన్ని సుగర్ కోటెడ్ గా ఇస్తే బాగుండేది కానీ.. మొదట్నుంచి చివరి వరకు ఏదో పాఠం చెబుతున్నట్లుగా సన్నివేశాలను తీర్చిదిద్దారు. మహిళల సమస్యలు.. వారి సాధికారత మీద తీసుకున్న క్లాస్ ఓవర్ డోస్ అయిపోయి సినిమా ప్రీచీగా తయారైంది.

## నటీనటులు:

'పరదా'లో పెర్ఫామెన్సుల పరంగా ఏమీ లోటు లేదు. అనుపమ పరమేశ్వరన్ సుబ్బలక్ష్మి పాత్రను ఎంతో ఇష్టపడి.. ఓన్ చేసుకుని చేసిందని అడుగడుగునా తెలుస్తుంటుంది. ఆ పాత్ర కోసం ఆమె పూర్తిగా అవతారం మార్చుకుని.. చక్కగా హావభావాలు పలికిస్తూ ఆకట్టుకుంది. చాలా త్వరగా అనుపమను మరిచిపోయి సుబ్బుతో కనెక్ట్ అయిపోతాం. తీవ్ర మనోవేదన అనుభవించే సన్నివేశాల్లో అనుపమ నటన కట్టిపడేస్తుంది. టాలెంటెడ్ మలయాళ నటి దర్శన రాజేంద్రన్ కీలక పాత్రలో రాణించింది. కొన్ని సన్నివేశాల్లో తన ప్రత్యేకతను చాటుకుంది. ఐతే ఆ పాత్ర ఇంకా బలంగా ఉండాల్సిందనిపిస్తుంది. రత్నం పాత్రలో సంగీత కూడా ఆకట్టుకుంది. ఆ క్యారెక్టర్ కు ఆమె ఒక నిండుదనం తెచ్చింది. హీరోయిన్ తండ్రి పాత్రలో బలగం నటుడు.. ఆమె ప్రేమికుడిగా రాగ్ మయూర్ కూడా బాగా చేశారు. క్యామియో రోల్ లో గౌతమ్ మీనన్ మాత్రం పెద్దగా ఇంపాక్ట్ వేయలేకపోయాడు.

## సాంకేతిక వర్గం:

టెక్నికల్ గా 'పరదా'లో మంచి ప్రమాణాలు కనిపిస్తాయి. గోపీసుందర్ మంచి పాటలు.. నేపథ్య సంగీతంతో సినిమాకు బలమయ్యాడు. మృదుల్ ఛాయాగ్రహణం కూడా బాగుంది. చిన్న బడ్జెట్ సినిమా అయినా విజువల్స్ బాగున్నాయి. ప్రొడక్షన్లో క్వాలిటీ కనిపిస్తుంది. పూజిత శ్రీకంటి.. ప్రహాస్ బొప్పుడిలతో కలిసి ప్రవీణ్ కాండ్రేగుల రాసిన స్క్రిప్టులో విషయం ఉంది. కానీ ఈ కథకు వర్తమాన నేపథ్యాన్ని తీసుకోవడం మైనస్ అయింది. వెనుకటి కాలం కథగా.. నాగరికతకు దూరంగా ఉన్న ప్రపంచంలో దీన్ని ప్రెజెంట్ చేసి ఉంటే ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతి కలిగేదేమో. వెరైటీ కాన్సెప్ తీసుకున్నా.. ట్రీట్మెంట్ విషయంలో రొటీన్ టెంప్లేట్ ఫాలో అయిపోవడంతో 'పరదా' ఎఫెక్టివ్ గా తయారు కాలేకపోయింది.

**చివరగా: పరదా.. మంచి కాన్సెప్టే కానీ**

**రేటింగ్- 2.25/5**



# సమంతతో 200 కోట్ల ఎక్స్ పెరిమెంట్..?


తెలుగులో స్టార్ అయిన సమంత అటు తమిళ్ లో కూడా అదే రేంజ్ ఫాం కొనసాగించింది. అక్కడ కూడా స్టార్స్ తో కలిసి జత కట్టి సత్తా చాటింది సమంత. సౌత్ స్టార్ హీరోయిన్ సమంత ఈమధ్యనే తన 15 ఏళ్ల సినీ వసంతాలను పూర్తి చేసుకుంది. ఇన్నేళ్ల జర్నీలో సమంత ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. ఇలా వచ్చి అలా కనుమరుగయ్యే హీరోయిన్స్ ఉన్న ఈ టైం లో ఏమాయ చేసావే సినిమాతో పరిచయమై తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకుంది అమ్మడు. కెరీర్ లో స్టార్ క్రేజ్ ని త్వరగానే అందుకుంది సమంత. తొలి సినిమా హిట్ ఆ తర్వాత రాజమౌళి దృష్టిలో పడి ఈగ ఛాన్స్ రావడం. అది కూడా సూపర్ హిట్ అవ్వడం మహేష్, ఎన్ టీ ఆర్ ఇలా స్టార్స్ తో నటించడంతో అమ్మడి రేంజ్ మరింత పెరిగింది. ! కెరీర్ లో కొంత బ్యాడ్ టైం.. తెలుగులో స్టార్ అయిన సమంత అటు తమిళ్ లో కూడా అదే రేంజ్ ఫాం కొనసాగించింది. అక్కడ కూడా స్టార్స్ తో కలిసి జత కట్టి సత్తా చాటింది సమంత. ఐతే ప్రతి హీరోయిన్ కి కెరీర్ లో కొంత బ్యాడ్ టైం నడుస్తుంది. ఆ టైం ని కూడా చాలా సమర్ధవంతంగా ఫేస్ చేసింది సమంత. ఇక పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్ లో ఇబ్బందులు ఆమెను మరింత వెనక్కి నెట్టాయి. మయోసైటిస్ వల్ల సమంత దాదాపు రెండేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. తెలుగులో విజయ్ దేవరకొండతో ఖుషి సినిమా చేసిన సమంత ఆ తర్వాత మరో సినిమాకు సైన్ చేయలేదు. ఐతే ఆఫ్టర్ లాంగ్ టైం సమంత శుభం సినిమాలో క్యామియో రోల్ చేసింది. ఐతే అది కూడా తన సొంత ప్రొడక్షన్ లో సినిమా కాబట్టే ఆ మూవీలో నటించింది. సమంత ఎప్పుడు వెనకపడ్డా కూడా దానికి డబుల్ ఫోర్స్ తో మళ్లీ ముందుకొస్తుంది. వీడియో వైరల్ సమంత లీడ్ రోల్ లో రక్త్ బ్రహ్మాండ్.. ఈమధ్యనే సిటాడెల్ సీరీస్ తో బాలీవుడ్ ఆడియన్స్ ని అలరించిన సమంత. నెక్స్ట్ రాజ్ అండ్ డీకే చేస్తున్న 200 కోట్ల ప్రాజెక్ట్ లో నటిస్తుందని తెలుస్తుంది. రాజ్ అండ్ డీకే తో సమంత కాంబినేషన్ లో ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్ సీరీస్ లు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆ దర్శక ద్వయం నెక్స్ట్ రక్త్ బ్రహ్మాండ్ అంటూ ఒక సీరీస్ ని చేస్తున్నారు. నెట్ ఫ్లిక్స్ నిర్మిస్తున్న ఈ వెబ్ సీరీస్ 200 కోట్ల బడ్జెట్ తో భారీగా ఉండబోతుందట. ఇందులో సమంత లీడ్ రోల్ లో నటిస్తుంది. సమంతతో అంత బడ్జెట్ తో సీరీస్ అంటే రిస్క్ అనే చెప్పొచ్చు. కానీ సబ్జెక్ట్ మీద ఉన్న కాన్ ఫిడెన్స్ తో ముందుకెళ్తున్నారట. త్వరలోనే ఈ సీరీస్ కు సంబంధించిన అప్డేట్ బయటకు వస్తుంది. సమంత తెలుగు సినిమాలు చేయకపోవడంతో ఆమె తెలుగు ఫ్యాన్స్ కాస్త అప్సెట్ లో ఉన్నా కూడా అమ్మడు బాలీవుడ్ లో చేస్తున్న సినిమాల పట్ల సంతృప్తిగా ఉన్నారు.

# మనిషిని పంపి మరీ తీసుకెళ్లారు - చంద్రబోస్



చంద్రబోస్.. ఆయన అక్షరాలు తెలుగు పాటకు జరిగే పట్టాభిషేకాలు.. కొన్ని వేల ట్యూన్లకు తన అక్షరాలతో ప్రాణం పోసిన ఆయన మొదటిగా తాజ్ మహల్ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు. చంద్రబోస్ కెరీర్ లో డైరెక్టర్ రాఘవేంద్రరావుది చాలా ప్రత్యేక స్థానం. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో తెరకెక్కిన సినిమాల్లో పలు పాటలకు చంద్రబోస్ లిరిక్స్ అందించారు. మనిషిని పంపి మరీ తీసుకెళ్లారు తాజ్‌మహల్ సినిమాలో పాట రాశాక తాను ఇంజనీరింగ్ చేస్తూ కూకట్‌పల్లిలో ఒక ఇంట్లోని నాలుగో ఫ్లోరులో ఉండేవాడినని, ఒకరోజు నేల మీద చాప వేసుకుని నిక్కరుతో పడుకుని ఉన్న టైమ్ లో తన వద్దకు ఓ మనిషి వచ్చి మా బాబాయి మిమ్మల్ని తీసుకురమ్మంటున్నారని అన్నారని, ఎవరని అడిగితే అప్పుడు రాఘవేంద్ర రావు గారు పేరు చెప్పడంతో తాను ఒక్కసారిగా షాకయ్యానని చెప్పారు చంద్రబోస్. అదే ఆయనతో మొదటి పరిచయం రాఘవేంద్ర రావు గారు లాంటి మనిషి నా కోసం మనిషిని పంపడమేంటని ఆశ్చర్యపోయానని, పదండి వెళ్దాం అంటే కింద వరకు వెళ్లి ఎస్టీడీ బూత్ లో ఆయనతో ఫోన్ మాట్లాడానని, వెంటనే తిరుపతికి రమ్మంటే ట్రైన్ లో తిరుపతికి వెళ్లి భీమాస్ హోటల్ లో ఆయన్ను కలిశానని, ఆ టైమ్ లో రాఘవేంద్ర రావు గారితో పాటూ కీరవాణి గారు కూడా అక్కడే ఉన్నారని, కీరవాణి గారు అప్పుడు మా పెరటి జాంచెట్టు పళ్లన్నీ సాంగ్ ను కంపోజ్ చేస్తున్నారని చంద్రబోస్ తెలిపారు. ఆ మాటతో షాకయ్యా అలా రాఘవేంద్రరావు గారితో మొదలైన తన జర్నీలో ఇద్దరి కాంబినేషన్ లో పలు పాటలు వచ్చాక ఒకసారి ఆయన ఫోన్ చేసి రమ్మంటే వెళ్లానని, వెళ్లగానే తనకు ఒక క్యాసెట్ ఇచ్చి వినమని చెప్పారని, విని చాలా అద్భుతంగా ఉన్నాయని చెప్పానని, అప్పుడాయన రామదాసు సినిమా చేస్తున్నారని చెప్పారు చంద్రబోస్. సాంగ్స్ అన్నీ విన్నావు కదా, అందులో ప్రతీ పాటలో రామ రామ అని ఉంటుంది, ఇప్పుడు నువ్వు కూడా అలానే ఒక పాట రాయాలి అని చెప్పడంతో సరే అన్నానని, అయితే అసలైన ట్విస్టు ఇక్కడే ఉందని, నువ్వు రాయాల్సింది శోభనం సమయంలో వచ్చే పాట అని చెప్పడంతో షాకయ్యానని ఆ తర్వాత షాక్ నుంచి తేరుకుని పాటను రాసినట్టు చంద్రబోస్ తెలిపారు. తనకు చాలా సవాలుగా అనిపించిన పాట ఆదేనని చంద్రబోస్ చెప్పారు.

# బికినీలో గత్తర లేపుతున్న హీరోయిన్..ఆ లుక్ ఏంటి గురూ!



ఈ మధ్యకాలంలో హీరోయిన్ ల హాట్ అందాలకు అవధులు లేకుండా పోతున్నాయి. వారి లోలోపలి అందాలను బట్టలతో కప్పి ఉంచకుండా.. అందాల అడ్డుగోడలు తొలగిస్తున్నారు.. కొంతమంది హీరోయిన్లు అవకాశాల కోసం ఈ పని చేస్తుంటే.. మరి కొంత మంది హీరోయిన్లు సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ని పెంచుకునే పనిలో ఇలాంటి పొట్టి పొట్టి బట్టలు వేస్తూ ఉంటారు. అయితే తాజాగా ఓ బ్యూటీ తన అందానికి ఉన్న అడ్డుగోడలన్నీ తొలగించి బికినీ ఫొటోస్ తో కుర్రాళ్లకు సెగలు పుట్టిస్తోంది. మరి ఇంతకీ ఆ హీరోయిన్ ఎవరు..? ఈ బికినీ ఫోటో స్టోరీ ఏంటి ? అనేది ఇప్పుడు తెలుసుకుందాం..హీరోయిన్ వేదిక.. ఈ పేరు అంత పాపులర్ కాకపోయినప్పటికి.. ఈ హీరోయిన్ ని చూస్తే మాత్రం అందరికీ తెలిసిన హీరోయిన్ అనిపిస్తుంది. రాఘవ లారెన్స్ నటించిన కాంచన 3, ముని వంటి సినిమాల్లో నటించిన హీరోయిన్ అంటే వెంటనే గుర్తు పట్టేస్తారు. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ సినిమాల కంటే ఎక్కువగా తన హాట్ ఫోటోలతోనే ఫేమస్ అవుతోంది. సోషల్ మీడియాలో వేదిక ఇంస్టాగ్రామ్ ఓపెన్ చేస్తే చాలు.. ఆమె హాట్ ఫోటోలు నెట్టింట్లో దర్శనమిస్తాయి. వీటిని చూస్తే వేదిక ఎప్పుడు అభిమానులను ఆకర్షించే పనిలోనే ఉంటుంది అని అనక మానరు.అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా ఆరెంజ్ కలర్ బికినీలో చాలా హాట్ గా ఉన్న ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. ఆరెంజ్, పింక్ కలర్ కాంబినేషన్ లో ఉన్న బికినీ ధరించి సోషల్ మీడియాలో రచ్చ లేపుతోంది. వేదిక హాట్ ఫోటోలు చూసిన చాలామంది నెటిజన్లు పలు రకాల కామెంట్స్ పెడుతున్నారు. ప్రస్తుతం వేదిక బికినీ ఫొటోస్ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. అలా బికినీలకు కేరాఫ్ అడ్రస్ గా మారిపోయిన వేదిక అభిమానులను, దర్శక నిర్మాతలను ఆకర్షించడమే పనిగా పెట్టుకుంది కావచ్చు అంటున్నారు ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు.

GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.